
సాక్షి
ఒడిశా
ఆదివారం । 12 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 5,30,621లు, బంగారం 5 గ్రాముల 620 మిల్లీ గ్రాములు, వెండి 48 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అవకాశాలు వినియోగించుకోండి

- 8లో.



'ఒడియాకు శాస్త్రీయ భాష హోదా కల్పించాలి'

- 8లో.

న్యూస్‌రీల్

విమానయాన చార్జీలు ఖరారు



రొంగైలుండా ఎయిర్ స్ట్రిప్‌లో విమానం

భువనేశ్వర్: గంజాం జిల్లా రొంగైలుండా, భువనేశ్వర్ మధ్య రాకపోకలు చేసే విమానాల చార్జీ, వేళలు ఖరారు చేశారు. రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ రాకపోకల వేళలను ప్రచురించింది. గంజాం జిల్లా కలెక్టర్ దిబ్య జ్యోత్ పరిడా ప్రత్యక్ష పర్యవేక్షణలో అనుబంధ యంత్రాంగం ప్రయాణికులు ముందుగానే టిక్కెట్లు కొనుగోలు కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈనెల 12వ తేదీ నుంచి 29వ తేదీ వరకు టికెట్ల అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం ప్రారంభమైంది. ఒక వైపు విమానయానం టిక్కెట్ ధర పన్నుల మినహాయింపుతో రూ.1,200 ఖరారు చేశారు. టిక్కెట్ల ముందస్తు బుకింగు కోసం గంజాం జిల్లా కలెక్టర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఉద్భవ్ సెఠితో 82800 85437 ఫోన్లో సంప్రదించాల్సి ఉంటుంది.

ఇద్దరు అధికారులు సస్పెండ్



సస్పెండైన అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల బీడీ ఆకుల ఫారెస్ట్ రేంజ్ పరిధి కుదుములగూమ్మ గ్రామానికి చెందిన 8 మంది మృతి చెందిన ఘటనపై ప్రభుత్వం అందజేసిన నష్ట పరిహారంలో తమకు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసిన ఇద్దరు అధికారులను జిల్లాస్థాయి అటవీ అధికారి సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కుదుములగూమ్మ గ్రామానికి చెందిన బృంద పంగి, రామహరి దొర, బుద్రదోల, లక్ష్మణ్ బోడనాయిక్, మోహన్‌సింగ్, పరి హంతాల్, సమారి పంగి, రామ్ కమారీలు బీడీ ఆకులు తెస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందారు. వీరికి ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అయితే డబ్బులు అందించాలంటే తమకు ఒక్కొక్కరూ రూ.40 వేలు చొప్పున లంచం అందించాలని ఆ కుటుంబాలకు రేంజర్ దుర్గాప్రసాద్ నాయిక్, గార్డు పద్మినీ పట్నాయక్‌లు సూచించారు. మృతుల కుటుంబ సభ్యులు గిరిజన సమాజ సేవకుడు శరత్ చంద్ర బురదకు విషయాన్ని తెలియజేశారు. దీంతో శరత్‌చంద్ర బలిమెల ఫారెస్ట్ అధికారి ప్రఫుల్ల మాండాల్‌కు ఫిర్యాదు చేశాడు. విచారణ జరపగా నేరం రుజువవ్వడంతో లంచం అడిగిన అధికారులను జిల్లా అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి సస్పెండ్ చేశారు.


ఉగాది ఉత్సవాలకు సన్నాహాలు



మైదానాన్ని పరిశీలిస్తున్న నెక్కంటి తదితరులు

రాయగడ: స్థానిక తేజస్వీ హోటల్ ఎదురుగా ఉన్న మైదానంలో మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో జరగనున్న ఉగాది ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. తనతో పాటు మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, ఉగాది ఉత్సవ కమిటీకి చెందిన నెక్కంటి కృష్ణచైతన్య, ఇప్పిలి రాజు, పీవీపీ రాము, సీర రమణ, కౌన్సిలర్ మజ్జి శ్రీనివాస్, బనాఘటి తిరుపతిరావు తదితరులు మైదానాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ ఈసారి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. దీనిలో భాగంగా 15, 16వ తేదీల్లో మహిళల మధ్య మెహంది. ముగ్గుల పోటీలు, 15 ఏళ్ల లోపు చిన్నారులకు సాంప్రదాయ వస్త్ర అలంకరణ పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాసీపూర్‌లో భారీ వర్షం



పిడుగుపాటుతో కొబ్బరి చెట్టుపై మంటలు


రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. సమితిలోని ముండాగా గ్రామానికి చెందిన ఉదయ్ పాత్రో ఇంటి వెనుకనున్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో మంటలు చెలరేగాయి. గ్రామస్తుల సాయంతో మంటలను ఆర్పారు.

గిన్నిస్ రికార్డ్స్‌లో బిర్సా ముండా స్టేడియం



గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించిన బిర్సా ముండా స్టేడియం

- అత్యధిక సీట్లు ఉన్న హాకీ స్టేడియంగా గుర్తింపు



గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: పురుషుల హాకీ ప్రపంచ కప్‌ను విజయవంతంగా నిర్వహించడం కోసం రౌర్కెలా బీపీయూటీ క్యాంపస్ ప్రాంగణంలో ప్రపంచంలోనే అతిపెద్ద బిర్సా ముండా హాకీ స్టేడియం నిర్మించిన విషయం తెలిసిందే. కేవలం 15 నెలల స్వల్ప వ్యవధిలో దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ప్రపంచంలో అత్యధిక సీట్లతో ఈ అత్యాధునిక హాకీ స్టేడియం నిర్మించడం రాష్ట్ర క్రీడారంగంలో సరికొత్త చరిత్ర. 20,011 మంది ప్రేక్షకులు స్టేడియంలో కార్యక్రమాలను తిలకించేందుకు వీలుగా సీట్లు ఏర్పాటు కావడం విశిష్టత సంతరించుకుంది. ప్రపంచంలో అత్యధిక సీట్లతో అత్యాధునిక స్టేడియంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో బిర్సా ముండా స్టేడియం స్థానం సాధించింది. ఈ రికార్డు ధ్రువీకరణ పత్రం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం అందుకున్నారు.

క్రీడాభిమానుల్లో చెరగని ముద్ర

హాకీ ప్రపంచ కప్ 2023 భారతదేశ క్రీడాభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. టోర్నమెంట్ అద్భుతమైన విజయాన్ని సాధించడంతో పాటు రూర్కెలాలోని అత్యాధునిక సౌకర్యాలతో బిర్సా ముండా హాకీ స్టేడియం ప్రేక్షకులను మంత్రముగ్ధులు చేసింది. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా, అత్యధిక సంఖ్యలో మ్యాచ్‌ను వీక్షించేందుకు వీలుగా 15 నెలల స్వల్ప వ్యవధిలో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రపంచస్థాయి రికార్డు నెలకొలిపినట్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

రాష్ట్ర ప్రజలకు అంకితం: సీఎం నవీన్ పట్నాయక్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గుర్తింపు రాష్ట్రంలో క్రీడారంగం ప్రపంచ శ్రేణి పురోగతిని ప్రతిబింబించిందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ క్రీడాపటంలో రాష్ట్రం సుస్థిర స్థానం సొంతం చేసుకోవడం గర్వ కారణంగా ఉందన్నారు. ఈ విజయానికి కారకులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ కీర్తి రాష్ట్ర ప్రజలకు అంకితం చేసినట్లు ప్రకటించారు.

పట్టాలెక్కనున్న 'తేజస్'



పరుగులు తీసేందుకు సిద్ధంగా ఉన్న తేజస్ రైలు

- దేశ రాజధానికి 200 కి.మీ వేగంతో రైలు

భువనేశ్వర్: భువనేశ్వర్-న్యూఢిల్లీ మధ్య తేజస్ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలెక్కనుంది. స్థానిక కోచింగ్ డిపోలో 22 తేజస్ కోచ్‌లను సిద్ధం చేశారు. రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో పాత ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల స్థానంలో తేజస్ కోచ్‌లను జోడించి సెమీ హైస్పీడ్‌తో పరుగులు తీయించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

అత్యాధునిక సౌకర్యాలు

- గంటకు గరిష్ఠంగా 200 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీస్తుంది.
- స్వయంచాలిత (ఆటోమేటిక్) ప్రవేశ ద్వారాలు.
- పొగ, అగ్నిప్రమాదాల గుర్తింపు వ్యవస్థ.
- సీసీటీవీ కెమెరా నిఘా వ్యవస్థ.
- కాల్ బెల్.
- ఎలక్ట్రానిక్ పాసింజర్ రిజర్వేషన్ చార్టు.
- డిజిటల్ డెస్టినేషన్ బోర్డులు.
- యూఎస్‌బీ బోర్డుతో మొబైల్, ల్యాప్‌టాప్ చార్జింగ్ సౌకర్యం.



అధునాతన హంగులతో తేజస్ కోచ్ లోపలి దృశ్యం



స్మార్టు కిటికీతో ప్రతీ బెర్తుకు యూఎస్‌బీ బోర్డుతో మొబైల్, లాప్‌టాప్ చార్జింగ్ సౌకర్యం

- వై-ఫై సదుపాయం.
- బయో వాక్యూమ్ మరుగుదొడ్లు.

'మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి'



మహిళలను సత్కరిస్తున్న కీర్తివాస్ తదితరులు



ప్రతిభ కనబర్చిన మహిళలను సత్కరిస్తున్న ఇన్నర్ విల్ క్లబ్ ప్రతినిధులు

బరంపురం: ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.కీర్తివాస్ ఆకాంక్షించారు. ఛత్రపూర్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తివాస్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో మహిళలది గురుతర బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్రపతిగా ద్రౌపతి ముర్ము ఉండడం గర్వ కారణమన్నారు. మహిళా చట్టాలపై మహిళలను చైతన్యపరిచే విధంగా ప్రతి ఒక్కరూ చైతన్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళలను గౌరవించారు. అలాగే స్థానిక ప్రేమనగర్ మెయిన్ రోడ్‌లోని రోటరీ క్లబ్ మందిరంలో బరంపురం ఇన్నర్ విల్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలు జరుపుకున్నారు. అనంతరం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గౌరీ పాత్రో, కార్యదర్శి ఎస్.శిరీష, వి.అపర్ణ, ఎం.వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఓస్డమాకు అవార్డు

- అవార్డు అందుకున్న మంత్రి ప్రమీలా మల్లిక్



ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మంత్రి ప్రమీలా మల్లిక్

భువనేశ్వర్:

విపత్తు నిర్వహణలో అత్యద్భుత పాత్ర పోషిస్తున్న ఒడిశా స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఓస్డమా) సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్-2023 గెలుచుకుంది. మూడో విడత నేషనల్ ప్లాట్‌ఫారమ్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పురస్కారం ప్రదానం చేశారు. న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి ప్రమీలా మల్లిక్ అవార్డును అందుకున్నారు. ఆమెతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఓస్డమా చైర్మన్ ప్రదీప్ కుమార్ జెనా, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, ఓస్డమా మేనేజింగ్ డైరెక్టర్ నికుంజ బిహారీ ధొలా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జాతీయ స్థాయిలో విపత్తు నిర్వహణ రంగంలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు, సంస్థల నిస్వార్థ సేవను గుర్తించి భారత ప్రభుత్వం ఏటా సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారం గౌరవ సంకేతంగా అందజేస్తుంది. ఏటా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి జనవరి 23వ తేదీన ఈ అవార్డు విజేతలను ప్రకటిస్తారు. జాతీయ ప్లాట్‌ఫారమ్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ ప్రోగ్రాం మూడో సెషన్‌లో రూ.51 లక్షల నగదు బహుమతి, సర్టిఫికేట్‌తో కూడిన అవార్డును అందించారు.

1999లో స్థాపన...

సూపర్ సైక్లోన్ తర్వాత 1999వ సంవత్సరంలో ఓస్డమా స్థాపించారు. వివిధ రకాల ప్రకృతి, ఆకస్మిక విపత్తుల నిర్వహణ కోసం ఈ సంస్థ ఆధ్వర్యంలో పలు సంస్థలు ఏర్పాటై చురుకుగా పని చేస్తున్నాయి. ఒడిశా డిజాస్టర్ రెస్పాన్స్ యాక్షన్ ఫోర్స్ (ఒడ్రాఫ్), మల్టీ-హాజార్డ్ ఎర్లీ వార్నింగ్ సర్వీస్ (ఎంహెచ్ఈడబ్ల్యూఎస్) ఫ్రేమ్‌వర్క్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన వెబ్/స్మార్ట్ ఫో సతర్క్ కార్యక్రమాలు విపత్తు నిర్వహణలో ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించాయి. డైనమిక్ రిస్క్ నాలెడ్జ్ ఆధారంగా విపత్తు ప్రమాద సమాచారాన్ని అంచనా వేయడం, ట్రాకింగ్ చేయడం, అప్రమత్తం చేయడం కోసం సతర్క్ వ్యవస్థ దోహదపడుతుంది. రాష్ట్రాన్ని ముంచెత్తిన వివిధ తుపానులు హుద్‌హుద్ (2014), ఫణి (2019), అంఫాన్ (2020), 2020 సంవత్సరంలో రాష్ట్రంలో సంభవించిన వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో ఓస్డమా విశేషంగా సేవలందించింది.

అగ్ని ప్రమాదంపై సంయుక్త కమిటీ



మంటల్లో చిక్కుకున్న లక్ష్మీ మార్కెట్ కాంప్లెక్స్ (ఫైల్)

భువనేశ్వర్: పూరీ మారీచ్ కోట్ కూడలి లక్ష్మీ మార్కెట్ కాంప్లెక్స్ అగ్ని ప్రమాదంపై సంయుక్త కమిటీ విచారణ ప్రారంభమైంది. స్థానిక తహసీల్దార్, జిల్లా అగ్నిమాపక అధికారి, టౌన్ థాణా పోలీసు అధికారితో సంయుక్తంగా విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ బృందం ప్రమాద నష్టాన్ని అంచనా వేసి బాధ్యులను గుర్తించే దిశలో విచారణ కొనసాగిస్తుంది. ఈనెల 15వ తేదీలోగా ప్రభుత్వానికి తుది నివేదిక దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రమాదంలో 45 దుకాణాలు దగ్ధమైనట్లు సమాచారం. రూ.40 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు దుకాణదారుల అంచనా. మంటల తీవ్రతతో గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుకాణాలు, మొదటి అంతస్తు పైకప్పు బీటలు వారినట్లు గుర్తించారు. ప్రభావిత మార్కెట్ సముదాయం అగ్నిమాపక శాఖ పరిశీలనలో ఉంది. ఈ ప్రాంగణంలో 2 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. ప్రమాదంతో కాంప్లెక్స్‌లో దైనందిన వ్యాపార లావాదేవీలతో ముడిపడిన వర్గం ఉపాధిపై కలవరపడుతోంది. దీంతో వీరికి సముచిత పరిహారం కల్పించే దిశలో విచారణ కొనసాగుతుంది. విచారణ బృందం తుది నివేదిక ఆధారంగా మార్కెట్ కాంప్లెక్స్ యజమానికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటామని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన లక్ష్మీ మార్కెట్ కాంప్లెక్స్, సామ్రాట్ హోటల్, గెస్ట్ హౌస్‌లో ఎలాంటి ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదని స్పష్టం చేశారు. ఆకస్మిక ప్రమాదాల నియంత్రణ, భద్రత నేపథ్యంలో అనుబంధ ఏర్పాట్లకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులను ఈ వర్గం బేఖాతరు చేసినట్లు గుర్తు చేశారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి గిర్కన్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాత్రి ఒక విద్యార్థి అనుమానస్పదంగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పోడియ సమితి బప్పన్‌పల్లి పంచాయతీ సుక్‌పల్లి గ్రామానికి చెందిన నత్వా మాడ్కమి (11) ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నాడు. అయితే అకస్మాత్తుగా శుక్రవారం సాయంత్రం అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే తోటి విద్యార్థులు పాఠశాల ఇన్‌చార్జి అనిరోధా దాస్‌కు తెలియజేయడంతో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆరోగ్య కేంద్రానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు. అయితే తన కుమారుడిని ఎవరో చంపేశారని విద్యార్థి తండ్రి పోడియ మడ్కమి ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిస్టల్‌తో కాల్పుల కేసు

- ముగ్గురు నిందితులు అరెస్టు
- రూ.50 లక్షలు డిమాండ్ చేసిన నిందితులు
- ఇవ్వకపోవడంతో చంపేందుకు ప్లాన్



మాట్లాడుతున్న ఎస్పీ అభినవ్ సోన్‌కార్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీ, ఫేస్ మాస్కులు



పోలీసులకు లభించిన బుల్లెట్

జయపురం: స్థానికంగా ఒక వ్యాపారి వద్ద రూ.50 లక్షలు డిమాండ్ చేసి, ఇవ్వకపోవడంతో అతని కుమారుడిపై కాల్పులకు పాల్పడిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు కొరాపుట్ ఎస్పీ అభినవ సోన్‌కార్ తెలియజేశారు. జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ వ్యాపారి పవన్ కుమార్ అగర్వాల కుమారుడు ఆదర్శ కుమార్ అగర్వాల్(23) తనపై కాల్పులు జరిగినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు ఆదర్శకుమార్ తన కారులో ఇంటికి వెళ్తున్న సమయంలో డొంగతోట శ్మశానం సమీపంలో ముఖానికి మాస్కులు ధరించిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు కిరువైపులా నిల్చున్నారన్నారు. వారిలో కుడివైపున నిలుచున్న వ్యక్తి ఎర్రరంగు షర్ట్ వేసుకున్నాడని, అతడు అకస్మాత్తుగా కారు ముందుకు వచ్చి పిస్టల్ గురిపెట్టాడని పేర్కొన్నారు. దీంతో అగర్వాల్ తన కారుని వేగంగా ముందుకు నడిపినట్లు ఫిర్యాదులో వెల్లడించాడని వివరించారు. ఆ సమయంలో ఎడమవైపున ఉన్న మరో అగంతకుడు తనను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపాడని, అయితే అదృష్టం కొద్ది దుండగుడు కాల్చిన తూటాలు కారు ఎడమవైపున తగలడంతో తను ప్రమాదం జరగలేదని వివరించారు.

పక్కా ప్లానింగ్

ఆదర్శ్ కుమార్ అగర్వాల ఫిర్యాదుతో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. క్రిమినల్ జీత్ అలియాస్ అభిజీత్ అలియాస్ జిహిత్ మహురియ తన మిత్రులైన కరుడుగట్టిన నేరస్తులు జయనగర్ ఇమ్రాన్ ఖాన్, జయపురం బ్లాక్ కార్యాలయ ప్రాంత తులు భోశ్లే, ఇరిగేషన్ కాలనీ జమునగుడ వాసి ఫిరోజ్ నాగ్‌లతో కలసి పట్టణంలో ప్రముఖ వ్యాపారుల నుంచి డబ్బు సంపాదించేందుకు ప్లాన్ రూపొందించారని ఎస్పీ వెల్లడించారు. ముందుగా జయపురంలో రైస్‌మిల్లు, ఫోర్‌వీలర్ షోరూం, హోటల్ బిజినెస్, సినీప్లెక్స్ థియేటర్ మొదలగు వ్యాపారాలు ఉన్నటువంటి పవన్ అగర్వాల్‌ను టార్గెట్ చేశారని దర్యాప్తులో వెల్లడైందన్నారు. నిందితుడు అభిజీత్ మహురియ ముందుగా అగర్వాల వద్ద పని చేస్తున్న సచిన్ నాయిక్ నుంచి పూర్తి వివరాలు సేకరించాడని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సచిన్ నాయిక్‌కు ఒక ఫోన్‌ను మహురియ సమకూర్చినట్లు తెలిపారు. వారు పథకం ప్రకారం కొత్త సిమ్‌లను కొన్నారన్నారు. అనంతరం వారి పథకం ప్రకారం మహురియ, పవన్ అగర్వాల్‌కు ఫోన్‌చేసి రూ.50 లక్షలు డిమాండ్ చేసి, డబ్బు ఇవ్వకపోతే అతడి కుమారుడిని చంపుతామని హెచ్చరించాడని వివరించారు. తనకు కొంత సమయం కావాలని అలాగనే కొంత పైకం తగ్గించాలని పవన్ అగర్వాలా దుండగులను కోరారని తెలిపారు. దుండగులు రెండు, మూడుసార్లు అగర్వాలకు ఫోనులు చేసి డబ్బు డిమాండ్ చేయగా, అగర్వాల్ కొంత సమయం అడుగుతూ వచ్చాడని అలాగనే డిమాండ్ డబ్బు తగ్గించమని కోరాడన్నారు. ఫిబ్రవరి 26లోగా డబ్బు ఇవ్వకుంటే చంపుతామని హెచ్చరించారని ఎస్పీ వివరించారు. అయితే డబ్బు ఇవ్వకపోవడంతో నిందితులు ఫెరోజ్ నాగ్, ఇమ్రాన్ ఖాన్, సచిన్ నాయిక్, భోశ్లే, అభిజీత్ మహురియలు పవన్ అగర్వాల కుమారుడు ఆదర్శ కుమార్ అగర్వాలను చంపేందుకు ప్లాన్ వేశారన్నారు. అనంతరం ఆరోజు మధ్యాహ్నం భోశ్లే, ఫిరోజ్ నాగ్‌లు ఆదర్శ అగర్వాల్‌ను వెంబడించగా, ఇమ్రాన్ ఖాన్, అభిజీత్ మహురియలు పిస్టల్స్‌తో అగర్వాల ఇంటికి వెళ్లే మార్గంలో కాపు కాశారని వెల్లడించారు. రోడ్డు మలుపులో అగర్వాల కారు స్లో చేయగా నిందితులు కాల్పులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. అనంతరం దర్యాప్తు నిర్వహించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి పిస్టల్, మాస్కులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బి.సి, జయపురం పట్టణ పోలీసు అధికారి సంబిత్ కుమార్ బెహర తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తదితరులు

రేగిడి: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో బూరాడ జంక్షన్ వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టును పోలీసులు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎస్‌ఐ శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది వాహనాలను శనివారం తనిఖీలు చేశారు. ఎన్నికల సందర్భంగా డబ్బులు, మద్యం తరలింపును అడ్డుకునేందుకు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

- జిల్లా డీపీఎం ఆనందరావు



చాటాయవలసలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం

రేగిడి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి పంటలను సాగు చేస్తే పెట్టుబడి తక్కువతో పాటు ఆరోగ్యవంతమైన పంటను పొందడంతో పాటు మంచి ఆదాయం వస్తుందని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని చాటాయవలస, గుళ్లపాడు గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించారు. రైతులు వేసిన పంటలకు చీడపీడలు ఆశిస్తే మార్కెట్‌లో దొరికే రసాయనాలు, పురుగు మందులను వాడుతుండడంతో పంటల దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయన్నారు. ప్రీ మాన్‌సూన్, డ్రై సోయింగ్ విధానాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కరణం గోవిందరావు, వియ్యపు చక్రపాణి, రమాదేవి, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ పాల్గొన్నారు.

రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల కేటాయింపు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆదేశించారు. ఎన్నికల విధుల్లోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్లను రాండమ్‌గా కేటాయించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎ.సూర్యకుమారి, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఎస్‌బీసీ డీఐఓ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక సెలవు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పోలింగ్ రోజున కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రత్యేక సెలవు వర్తింపజేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నిక అధికారిణి ఎ.సూర్యకుమారి తెలిపారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

జోగింపేట పంచాయతీకి జాతీయ పురస్కారం!



మాట్లాడుతున్న సర్పంచ్ సింహాచలం

సీతానగరం: మండలంలోని జోగింపేట పంచాయతీ జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు సర్పంచ్ కల్యంపూడి సింహాచలం తెలిపారు. శనివారం ఇదే విషయమై స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన గ్రామంలోని ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులు జరగడంతో ఈ గౌరవం దక్కిందన్నారు. దీనికి కారకులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులకు కృతజ్ఞతలన్నారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. ముమ్మందు కూడా ఇదే ఉత్సాహంతో పనిచేసి, గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతానన్నారు.

కోవిడ్ మార్గదర్శకాలు పాటించాలి



- రాష్ట్రంలో 59 హెచ్3ఎన్2 ఇంఫ్లూయెంజా కేసులు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇప్పటివరకు 59 హెచ్3ఎన్2 ఇంఫ్లూయెంజా కేసులు నమోదైనట్లు ప్రభుత్వం శనివారం తెలియజేసింది. దీని నివారణకు ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కరోనా సంక్రమణ నివారణకు జారీ చేసిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. హెచ్3ఎన్2 లక్షణాలు కోవిడ్-19 కేసుల మాదిరిగానే ఉన్నాయని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా తెలిపారు. అయితే ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, తల నొప్పి వంటి లక్షణాలు ఉంటాయని పేర్కొన్నారు. తీవ్రమైన కేసులు ప్రమాదకరంగా ఉంటాయని, తక్కువ రోగనిరోధక శక్తి ఉన్నవారికి ప్రమాదకరమని హెచ్చరించారు. హెచ్3ఎన్2 ఇంఫ్లూయెంజాకు ఖచ్చితమైన చికిత్స అందుబాటులో లేదన్నారు. ముందు జాగ్రత్త చర్యగా, ప్రజలు కోవిడ్-19 మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని మిశ్రా వివరించారు.

మాస్క్ తప్పనిసరి

ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ప్రభుత్వం సూచించింది. నీరు ఇతరేతర ద్రవాలు పుష్కలంగా తీసుకోవాలన్నారు. తుమ్మేటప్పుడు రుమాలు అడ్డుగా పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. తీవ్రమైన లక్షణాలు తారసపడితే స్వీయ నిర్బంధం చక్కటి ఆరోగ్య సంరక్షణగా పేర్కొన్నారు. వ్యాధి సోకితే అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, గొంతునొప్పి, తీవ్రమైన దగ్గు, జలుబు, శ్వాసక్రియలో ఇబ్బందికర పరిస్థితులు పీడిస్తాయన్నారు.

రాష్ట్రంలో 59 హెచ్3ఎన్2 ఇంఫ్లూయెంజా కేసులు నమోదయ్యాయని స్థానిక ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం ఆర్ఎంఆర్‌సి డైరెక్టర్ డాక్టర్ సంఘమిత్ర పతి తెలిపారు. టీకాలు అందించడం, తక్షణ వైద్యం, చికిత్స కార్యకలాపాలపై ఆస్పత్రుల సంసిద్ధత ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అభ్యర్థించింది. ఇప్పటికే హర్యానా, కర్ణాటక రాష్ట్రాల్లో చెరొకరు చొప్పున ఇద్దరు వ్యక్తులు హెచ్3ఎన్2 తో మరణించారు.

‘ఒడియాకు శాస్త్రీయ భాష హోదా కల్పించాలి’



ఒడియా భాషా దినోత్సవంలో పాల్గొన్న వక్తలు, అతిథులు

పర్లాకిమిడి: ఒడిశాలో ఒడియా భాషకు ప్రభుత్వం శాస్త్రీయ భాష హోదా కల్పించాలని ఉత్కళ హితేషిణీ కార్యదర్శి పూర్ణచంద్ర మహాపాత్రో కోరారు. స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాల ఆడిటోరియంలో శాస్త్రీయ ఒడియా భాషా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్రొఫెసర్ ప్రేమానంద మహాపాత్రో, డా.ఫణీంద్రభూషణ్ మహాపాత్రో, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, ముఖ్యవక్త పూర్ణచంద్ర మహాపాత్రోలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఒడియా భాషను పూర్వీకులు, బ్రిటీష్ వారు ఓడ్రభాషగా పిలిచేవారని, కానీ ఒడియా గ్రాంథిక భాష కనుమరుగై భాష రూపాంతరం చెంది అనేక ప్రాంతాల్లో అనేక మాండలికాలు వ్యవహారిక భాషలో చలామణి అవుతున్నాయన్నారు. స్వర్గీయ కవి గోపినాథ నోందో భాషా తత్వం, శబ్దకోశం రాసినా ఇప్పటివారు ఎవ్వరూ స్వీకరించడం లేదని మహాపాత్రో ఆవేదన వ్యక్తం చేశారు. మహేంద్రగిరి నదీ ప్రాంతంలో ఉన్న పర్లాకిమిడికి గొప్ప చరిత్ర ఉందని ప్రొఫెసర్ ఫణీంద్ర భూషన్‌నంద అన్నారు.

2013 ఫిబ్రవరిలో ఒడియా భాషకు శాస్త్రీయ హోదా ప్రకటించినా ప్రభుత్వం అమలు చేయలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడియా భాషపై బెంగాలీ, ఇంగ్లీషు భాష ప్రభావం పెరిగి భాషస్థితి కోల్పోతుందని ప్రొఫెసర్ ప్రేమానంద మహాపాత్రో అన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అజయ్ కుమార్ త్రిపాఠి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిఘ్నేశ్వర మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యావంతులు

పరారైన రిమాండ్ ఖైదీ అరెస్ట్



పట్టుబడిన రిమాండ్ ఖైదీతో పోలీసులు

రాజాం సిటీ: సరిగ్గా రెండు నెలల క్రితం పోలీసుల కళ్లుగప్పి, తప్పించుకుని పరారైన రిమాండ్ ఖైదీని రాజాం పోలీసులు విజయవాడలో అరెస్ట్ చేశారు. సదరు ఖైదీని శనివారం రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల ఎదుట హాజరుపరిచి, సీఐ కె.రవికుమార్ వివరాలు వెల్లడించారు. చీపురుపల్లి మండలంలోని పత్తికాయపాలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబును విజయనగరం వన్‌టౌన్‌లో కేసు నిమిత్తం జనవరి 12వ తేదీన పాలకొండ సబ్‌జైలు నుంచి విజయనగరం కోర్టులో హాజరుపరిచారు. తిరిగి అదేరోజు సాయంత్రం పాలకొండ సబ్‌జైలుకు తరలిస్తుండగా రాజాం బస్టాండ్‌లో పోలీసులను తప్పించుకుని పరారయ్యాడు. ఈ మేరకు అతడికి ఎస్కార్ట్‌గా వచ్చిన సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అప్పటి నుంచి రాంబాబుపై నిఘా ఉంచి, అన్ని స్టేషన్లకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ నెల 9వ తేదీన విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో దొంగతనం చేస్తుండగా, స్థానికుల సహాయంతో అతడిని పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. అక్కడి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ వై.రవికిరణ్, సిబ్బందిని పంపించి, అరెస్ చేసి ఇక్కడికి తీసుకువచ్చామన్నారు. అతడిపై గతంలో రాజాం, చీపరుపల్లి, విజయనగరం వన్‌టౌన్, జామి, ఎస్.కోట పోలీస్‌స్టేషన్ల పలు దొంగతనాలకు సంబంధించి, కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఖైదీని రాజాం కోర్టులో హాజరుపరిచి, రిమాండ్ విధించడంతో పాలకొండ సబ్‌జైలుకు తరలించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వై.రవికిరణ్, వీబీ రామకృష్ణ పాల్గొన్నారు.

చింతచెట్టు పైనుంచి జారిపడి యువకుడి మృతి



అప్పారావు(ఫైల్)

సీతంపేట: చింతచెట్టు పైనుంచి జారిపడి ఊయక అప్పారావు(37) అనే యువకుడు మృతి చెందిన విషాద ఘటన మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మర్రిగూడ చెందిన అప్పారావు చింతబొట్టల కోసం వెలగాపురంలోని చింత చెట్టు ఎక్కాడు. బొట్టలు తీసిన తర్వాత చెట్టు దిగుతున్నప్పుడు ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు దోనుబాయి ఎస్‌ఐ కిశోర్ వర్మ తెలిపారు. ప్రస్తుతం పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

10 గడ్డివాముల దగ్ధం

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో 10 గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గ్రామానికి చెందిన శీర కాశినాయుడు, పైడినాయుడు, బిక్కిని వెంకన్నబాబు, యండమూరి త్రినాథ తమ పశువుల మేత కోసం సమీపంలోని కళ్లాల్లో గడ్డివాములు నిల్వచేశారు. అక్కడే ఉన్న విద్యుత్ తీగల కారణంగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి గడ్డివాములు కాలిపోయాయి. అప్రమత్తమైన స్థానికులు మంటలను ఆర్పివేసేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: గరుగుబిల్లి మండలంలోని ఉద్దవోలుకు చెందిన టి.శ్రీను అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శనివారం ఉదయం సద్దన్నం(చల్లంది) తిన్న తర్వాత పురుగుమందు తాగాడు. ఇదే విషయాన్ని ఆయన తన భార్య జానకికి తెలిపాడు. అప్రమత్తమైన ఆమె చుట్టుపక్కల వాళ్లను పిలిచి, మందు కక్కించే ప్రయత్నం చేసింది. అనంతరం వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. అతడి మరణానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

నార్త్‌కోస్ట్ పరిధిలో.. మూడు గ్రీన్ ఎనర్జీ జల విద్యుత్ కేంద్రాలు

- తారకరామ తీర్థసాగర్‌లో సారిపల్లి నిర్వాసితులను నోటిఫై చేయాలని ప్రభుత్వ ఆదేశాలు
- రూ.77 కోట్లతో 1400 కుటుంబాలకు పరిహారం
- రూ.388 కోట్లతో మహేంద్రతనయ ఆఫ్‌షోర్ నిర్మాణానికి భూమి పూజ
- జల వనరుల శాఖ నార్త్ కోస్ట్ సీఈ సుగుణాకరరావు



మాట్లాడుతున్న జలవనరుల శాఖ నార్త్ కోస్ట్ సీఈ సుగుణాకర రావు

బొబ్బిలి: తారకరామ తీర్థ సాగర్ నిర్మాణంలో తరలిపోనున్న 1400 కుటుంబాలకు రూ.5.50లక్షల చొప్పున రూ.77 కోట్ల పరిహారం పంపిణీకి ఆయా కుటుంబాలను నోటిఫై చేయాలని ప్రభుత్వం కలెక్టర్‌కు ఉత్తర్వులు పంపిందని జల వనరుల శాఖ నార్త్ కోస్ట్ సీఈ శంబంగి సుగుణాకరరావు తెలిపారు. తోటపల్లి పనుల పర్యవేక్షణ నిమిత్తం శనివారం ఇక్కడకు వచ్చిన ఆయన బొబ్బిలిలో కాసేపు విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ఈ కార్యక్రమం పూర్తవుతుందనీ, అనంతరం నిర్వాసితులకు పరిహారం పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే 53 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కోరాడపేట, పడాలపేట, ఏటీ అగ్రహారం గ్రామాలకు రూ.174 కోట్లతో ఆర్ఆర్, ఎల్‌ఏ కోసం మంజూరు కాగా ఇందులో రూ.34 కోట్లు విడుదలైందనీ, వీటి ఖర్చు పూర్తయితే మిగతా బడ్జెట్ దశల వారీగా విడుదలవుతుందన్నారు. మహేంద్రతనయ ఆఫ్‌షోర్ నిర్మాణానికి భూమి పూజ జరిగిందన్నారు. ఇందులో రెండున్నర కిలోమీటర్ల రిజర్వాయర్, 13 కిలోమీటర్ల పొడవున నీటి మళ్లింపు కాలువ(ఫ్లడ్ ఫ్లో కెనాల్)తో పాటు 12 కిలోమీటర్ల ఎడమ కాలువ, 19 కిలోమీటర్ల కుడి కాలువ నిర్మిస్తామన్నారు. 24,700 ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు కూడా 600 మీటర్ల పొడవున టన్నెల నిర్మాణం చేపడతామన్నారు. నేరడి బ్యారేజి నిర్మాణం అంతర్రాష్ట్ర వివాదం కారణంగా ప్రత్యామ్నాయంగా రూ.135 కోట్లతో హిరమండలంలో 1400 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేయనున్నామన్నారు. ఇందుకోసం 19 టీఎంసీల నిల్వ ఉండే రిజర్వాయర్‌ను హిరమండలం వద్ద నిర్మించనున్నట్టు చెప్పారు. దీని వలన శ్రీకాకుళం జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. మరో పక్క తోటపల్లి కాలువపైన తెర్లాం మండలం లోచర్ల వద్ద 1700 ఎకరాలకు, బొబ్బిలి మండలం రాముడువలస వద్ద 1800 ఎకరాలకు సాగు నీరందించే రెండు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.43 కోట్లతో పనులు చేపట్టేందుకు త్వరలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు రానున్నాయని చెప్పారు. వీఆర్ఎస్, పెదంకలాం, వట్టిగెడ్డ, ఆంధ్ర, పెద్దగెడ్డ ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు వేసవి కాలంలోనే చేపడుతున్నామని, ప్రస్తుతం ఆ పనులు జోరుగా సాగుతున్నాయన్నారు.

జంఝావతి వివాదానికి ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలు

జంఝావతి రబ్బర్ డ్యాం వద్ద రూ.16 కోట్లతో ప్రొటెక్షన్ వాల్ నిర్మించి 540 స్ట్రక్చర్ల నిర్మాణంతో పూర్తి స్థాయి సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే పలుమార్లు ఒడిశా ప్రభుత్వానికి నిర్వాసితులతో గ్రామసభలు పెట్టాలని కోరినా స్పందించడం లేదన్నారు. అయినప్పటికీ జంఝావతి నిర్మాణానికి ఒడిశా నుంచి అవసరమైన 1200 ఎకరాల భూమికి పరిహారం ధరను నిర్ణయిస్తే చెల్లిస్తామని కూడా సమాచారం ఇచ్చామన్నారు. ఇందులో 800 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మరో 400 ఎకరాలు ప్రైవేటు భూములున్నాయన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, భూ సేకరణ పూర్తయితే పనులు ప్రారంభించనున్నట్టు చెప్పారు. రూ.2,700 కోట్లు, రూ.1700 కోట్లతో రెండు ప్యాకేజీల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణమవుతుందన్నారు. ఉత్తరాంధ్రలో 8లక్షల ఎకరాలు సుజల స్రవంతి బృహత్తర పథకం ద్వారా సాగయితే అందులో ఉమ్మడి విజయనగరం జిల్లాకు దాదాపు 4లక్షల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు.

మూడు గ్రీన్‌ఎనర్జీ జల విద్యుత్ కేంద్రాలకు అనుమతులు

విశాఖ నార్త్ కోస్ట్ పరిధిలో మూడు గ్రీన్ ఎనర్జీ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అవసరమయ్యే నీటిని మిగులు జలాల ద్వారా వినియోగించుకునేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్టు సీఈ సుగుణాకరరావు తెలిపారు. విశాఖ జిల్లాలో రెండు, విజయనగరం జిల్లాలో ఒకటి చొప్పున మూడు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి రెండు సంస్థలు ముందుకు వచ్చినట్టు తెలిపారు. వేపాడ మండలం మారిక వద్ద రూ.2,440 కోట్లతో 600 మెగావాట్లు, విశాఖ జిల్లా చింతపల్లి మండలం యర్రవరం వద్ద రూ.2,500కోట్లతో 900 మెగావాట్లు, అదే జిల్లా అనంతగిరి మండలం పెద్దకోట వద్ద రూ.3,890 కోట్లతో 1000 మెగావాట్లతో మూడు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అవసరమైన మిగులు జలాలను వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టులు గ్రీన్ ఎనర్జీ తరహాలో నిర్మాణం కానున్నాయన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఆయా గ్రిడ్‌లకు సరఫరా చేస్తాయన్నారు.

రూ.140 కోట్లతో ఉపాధి కాంపొనెంట్ పనులు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉపాధి హామీ చెరువుల లోతు పనుల కన్నా మెటీరియల్ కాంపొనెంట్‌కే ప్రాధాన్యత ఇచ్చేందుకు ఆదేశాలిచ్చామని సీఈ సుగుణాకరరావు తెలిపారు. ఇప్పటికే పార్వతీపురం, విజయనగరం ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. మెటీరియల్ కాంపొనెంట్ పనులకు వెంట వెంటనే బిల్లులు చేస్తున్నట్టు చెప్పారు. ఈ పనులను జల వనరుల శాఖ అధికారులు పర్యవేక్షించనున్నట్టు స్పష్టం చేశారు. మంజూరు ఉత్తర్వులు డ్వామా చూస్తుందన్నారు. కాలువల నిర్మాణం, గొలుసు కట్టు చెరువుల వాగులు, వనరుల అభివృద్ధికి ఈ నిధులు ఊతమివ్వనున్నాయని చెప్పారు.

అవకాశాలు వినియోగించుకోండి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సరక తదితరులు

- మంత్రి జగన్నాథ సరక

రాయగడ: విద్యావిధానంలో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక సూచించారు. స్థానిక రాయగడ అటానమస్ కళాశాల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే ప్రగతి సాధించగలమన్నారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇదే కళాశాలలో చదువుకున్న తాను వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సహకరించిందన్నారు. అవసరమైన నిధులు సమకూర్చడంతో విద్యార్థులు వసతి సౌకర్యాలను పొందగలుగుతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, కళాశాల గవర్నింగ్ బాడీ అధ్యక్షుడు, ఏడీఎం సోమనాథ్ ప్రధాన్, బరంపురం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గీతాంజలి దాస్, కళాశాల ప్రిన్సిపాల్ పీకె గంతాయిత్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హజరైన అధ్యాపకులు, విద్యార్థులు

ఖాతాల్లో నగదు మాయంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన బాధితులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి కుమారధాముని పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసిన నగదు మాయం కావడంపై ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం దృష్టికి శనివారం తీసుకువెళ్లారు. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. తాము పోస్టాఫీసులో డిపాజిట్ చేసిన నగదును తిరిగి ఇప్పించమని కోరారు. దీనికి స్పందించిన ఏడీఎం ప్రధాన్ త్వరలో దర్యాప్తు చేసి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఇదీ విషయం..?

కుమార్‌ధాముని పోస్టాఫీస్‌లో ఇప్పటివరకు సుమారు రూ.25 లక్షలకు పైగా ఖాతాదారులు దాచుకున్న సొమ్ము మాయమైనట్లు సమాచారం. పోస్టు మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ముఖేష్ చౌధరి అనే వ్యక్తి నగదును డిపాజిట్ చేసేందుకు వచ్చే ఖాతాదారులకు నకిలీ పాస్ బుక్‌లను మంజూరు చేసి నగదు డిపాజిట్ చేసినట్లుగా నమ్మించాడు. అనంతరం ఖాతాదారుల సొమ్మును స్వాహా చేసినట్లు బాధితులు కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని తమ గోడును వినిపించారు. ఇదే విషయమై రాయగడ ప్రాంతీయ హెడ్ పోస్టాఫీసు మేనేజర్ జవహర్‌లాల్‌రావును వివరణ కోరగా ఈ విషయమై తాను సమగ్ర దర్యాప్తు చేస్తానన్నారు. అవకతవకలకు పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

2,454 కేసులు పరిష్కారం



బరంపురం: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి మోలయ రంజన్ దాస్ తదితరులు



జయపురం: జయపురం జిల్లా కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: కొరాపుట్, కోట్‌పాడ్, లక్ష్మీపూర్, సెమిలిగుడ, దశమంతపూర్ తదితర కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్‌లు శనివారం నిర్వహించారు. ఈ ఏడాది మొదటిసారిగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో 2,454 కేసులు పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసుల నుంచి రూ.70,77,355 జరిమానాలుగా వసూలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర, స్వాతంత్ర్య విజిలెన్స్ జడ్జి రాజేష్ ఎక్క, అదనపు జిల్లా జడ్జి ఇ.విఘ్నేశ్వరరావు, ఫ్యామిలీ కోర్టు జడ్జి పవిత్ర మోహణ సామల్, పోస్కో జడ్జి సీహెచ్ వాసుదేవ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

బరంపురం: స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో వందలాది కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా జడ్జి మలయో రంజన్ దాస్ పాల్గొని జాతీయ లోక్ అదాలత్‌ని ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మోటార్ ట్రిబునల్ కేసులు, బ్యాంక్ రుణాల కేసులు, బీమా తదితర కేసులు పరిష్కరించారు.

క్లుప్తంగా

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు రామకృష్ణ


రామకృష్ణ

నరసన్నపేట: స్థానిక వీర హనుమాన్ వ్యాయామ శాలలో వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందుతున్న రావాడ లచ్చయ్యపేటకు చెందిన కింజరాపు రామకృష్ణ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లో ఈ నెల 15 నుంచి 18 వరకూ జరిగే ఈ పోటీల్లో ఏయూ తరఫున 61 కేజీల విభాగంలో రామకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తాడని కోచ్ అప్పలరామయ్య శనివారం తెలిపారు. కాగా రామకృష్ణ విశాఖ బుల్లయ్య కళాశాలలో బీపీ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు చెప్పారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

పొందూరు: పొందూరు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రైలు కింద పడి ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామానికి చెందిన లింగాల నాగేంద్రకుమార్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. రైలుపట్టాలపై రైల్వే సిబ్బంది మృతదేహాన్ని చూసి సమాచారం ఇచ్చారని జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాస రావు తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడేందుకు కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. యువకుడి తండ్రి లింగాల కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచ నామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

వ్యాక్సిన్ వికటించి 15 గొర్రెలు మృత్యువాత

సంతబొమ్మాళి: మండలంలోని పాలతలగాంలో గొర్రెలకు వేసిన వ్యాక్సిన్ వికటించడంతో కర్రి అప్పన్నకు చెందిన 15 గొర్రెలు మృతిచెందగా మరో 35 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. నాలుగు రోజుల క్రితం గ్రామ సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్.. గొర్రెల పొక్కుల వ్యాధి నివారణకు షీప్‌ఫాక్స్ వ్యాక్సిన్ ఇచ్చారు. పోలాకి మండలం వనవిష్ణుపురం గ్రామానికి చెందిన వ్యక్తితో గొర్రెలకు ఆ వ్యాక్సిన్ వేయించారు. తర్వాత రోజు నుంచే అస్వస్థతకు గురై 15 గొర్రెలు మృతిచెందాయని, మరో 35 తీవ్ర అస్వస్థతతో ఉన్నాయని అప్పన్న వాపోయారు. గొర్రెల పెంపకమే జీవనాధారమని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు. ఈ విషయమై మండల పశువైద్యాధికారి అప్పలసూరి వద్ద ప్రస్తావించగా ప్రస్తుతం పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తున్నామని, షీప్‌ఫాక్స్ వ్యాక్సిన్ పంపిణీ, గొర్రెలు మృత్యువాత చెందడంపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

తప్పిన పెను ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు ముందుభాగం

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పలాస వైపునుంచి మెళియాపుట్టి వైపు కారు వేగంగా దూసుకువస్తూ అదుపుతప్పి చాపర మెయిన్ రోడ్డు ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభానికి బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. సేఫ్టీ బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. హిరమండలం మండలానికి చెందిన వారుగా తెలుస్తుంది. అర్ధరాత్రి జనసంచారం లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్‌శాఖ అధికారులు సమాచారం అందుకుని రాత్రికి రాత్రే మరమ్మతులు చేశారు.

గడ్డికుప్పలు దగ్ధం


దగ్ధమవుతున్న గడ్డి కుప్పలు

సారవకోట: మండలంలోని గుమ్మపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి ఐదెకరాల గడ్డి కుప్పలు దగ్ధమైయ్యాయి. గ్రామానికి చెందిన కౌలు రైతులు దండి వరాలు, కత్తిరి మోహనదాస్‌కు చెందిన గడ్డికుప్పలు కాలిబూడిదయ్యాయి. కోటబొమ్మాళి నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపుచేశారు. కావాలనే కొంతమంది తమ గడ్డికుప్పలకు నిప్పుపెట్టారని మోహనదాస్ ఆరోపిస్తున్నారు.

పొరుగు మురుగుతో.. అవస్థలు

- సరిహద్దు గ్రామాలను ముంచెత్తుతున్న మురుగునీరు, వ్యర్థాలు
- నష్టపోతున్న రైతులు
- గత పదేళ్లుగా ఇదే పరిస్థితి..


ఒడిశా మురుగునీరు పంట పొలాల్లో చేరడంతో పెగిరిన పిచ్చిమొక్కలను చూపిస్తున్న రైతు

పాతపట్నం: ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి పట్టణంలోని మురుగునీరు ఆంధ్రా సరిహద్దు గ్రామాలను ముంచెత్తుతోంది. ఆంధ్రా వైపు వస్తున్న కాలువల్లో పూడికలను అక్కడి ప్రభుత్వం జేసీబీలతో తీయిస్తుంది. ఆ వ్యర్థాలు కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామాల్లోకి వచ్చి చేరుతుంది. సుమారు 40 ఎకరాల్లో పంట పొలాలు మురుగునీటితో నిండిపోతున్నాయి. గత పదేళ్లుగా ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఆంధ్ర, ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా.. వారి నుంచి స్పందన లేకపోవడంతో సరిహద్దు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.


ఒడిశా మురుగునీటితో నిండిన ఆంధ్రా పంట పొలాలు


ఒడిశా నుంచి ఆంధ్రాలోకి వస్తున్న మురుగుకాలువ

పొలంలో కాలు పెట్టలేకపోతున్నాం



లక్షల రూపాయల విలువైన భూముల్లో మురుగునీరు, చెత్తాచెదారం చేరడంతో పంటలు వేసుకోలేకపోతున్నాం. పొలంలో కాలుపెడితే గాజు పెంకులు గుచ్చుకుంటున్నాయి. గత పదేళ్లుగా పంట వేయలేకపోయాం.

– గుర్రాల రాములు, రైతు, హరిజనగోపాలపురం

పంటలు వేయలేకపోతున్నాం



మా భూములను ఒడిశా మురుగునీరు ముంచెత్తుతుండడంతో పంటలు వేసుకోలేకపోతున్నాం. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కనీసం పొలం వద్దకు వెళ్లలేకపోతున్నాం. ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదు.

– అమిటి బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు, హరిజనగోపాలపురం

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..



రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ విషయాలన్నీ ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. ఆంధ్రా సరిహద్దులో కాలువను తవ్వనీయకుండా చర్యలు తీసుకుంటాం. పంట పొలాల్లో మురుగునీరు రావడంతో రైతులు ఎంతో నష్ట పోతున్నారు.

– కె.రవిచంద్ర, తహసీల్దార్, పాతపట్నం

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


ఎస్ఐ కృష్ణప్రసాదును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

సరుబుజ్జిలి: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాదు తెలిపారు. స్థానిక వెంకటసాయి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల నడవడికతోనే చదువుకున్న సంస్థకు, తల్లిదండ్రులకు మంచిపేరు వస్తుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ కూన జగన్నాథం, ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు, హిరమండలం ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్లీల చిత్రాలను నిషేధించాలి

నరసన్నపేట: సోషల్ మీడియాలో అశ్లీలత పెరిగిపోతుందని, యువత చెడు మార్గాల వైపు మళ్లే ప్రమాదం ఉందని, వీటిని వెంటనే నిషేధించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం వీరు నరసన్నపేటలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మెడికల్ మాఫియా ఆగడాలు అధికవుతున్నాయని, వైద్యాధికారులు, ఔషధ నియంత్రణ మండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలన్నారు. నరసన్నపేట ఏఐవైఎఫ్ నాయకులు సాంబశివరావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సర్పంచ్, కుమారుడిపై కేసుల నమోదు


విచారణ చేస్తున్న డీఎస్పీ శివరామిరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మశాఖపురం గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు రాకపోకలు సాగించే రహదారిని అడ్డుకున్న స్థానిక సర్పంచ్ ఆశి తులసమ్మ, టీడీపీ నాయకుడు ఆశి మాధవరెడ్డితో పాటు మరో పదిమందిపై కేసులు నమోదు చేసినట్లు శనివారం ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. శివాలయం వద్ద నవగ్రహాల నిర్మాణం పేరుతో వాస్తు దోషం ఉందంటూ ఆశి మాధవరెడ్డితో పాటు టీడీపీ నాయకులు కుల వివక్ష చూపుతూ దళిత కాలనీలోని ఇళ్ల ముందు నుంచి ప్రహరీ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. అడ్డుకున్న దళిత కుటుంబాలపై దూషణకు దిగడంతో ఇటీవల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒకవైపు పోలీసుల విచారణ సాగుతుండగానే టీడీపీ నాయకుడు ప్రహరీ నిర్మించారు. విషయం తెలుసుకున్న కేఎన్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మిస్క కృష్ణయ్య ఆధ్వర్యంలో జిల్లా దళిత సంఘాలు గ్రామానికి చేరుకొని దళితులకు జరిగిన అన్యాయాన్ని జాయింట్ కలెక్టర్ నవీన్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి రంగ ప్రవేశం చేసి పరిస్థితిని సమీక్షించారు. కుల దూషణ, దాడిపై టీడీపీ సర్పంచ్ ఆశి తులసమ్మ, ఆమె కుమారుడు, మండల టీడీపీ నాయకుడు ఆశి మాధవరెడ్డితో పాటు మరో పది మందిపై కేసు నమోదు చేశారు. తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, సీఐ ఆర్.ఈశ్వరచంద్ర ప్రసాద్, ఎస్ఐ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

జెమ్స్‌లో ఫ్రెషర్స్‌డే వేడుకలు


ఓథ్ నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్‌లో నర్సింగ్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు (ల్యాంప్ లైటింగ్) శనివారం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల సీనియర్ ఫౌండర్ డాక్టర్ కె.సుధీర్ మాట్లాడుతూ వైద్యులు, నర్సులు సమాజానికి రెండు కళ్లని అభివర్ణించారు. నిజాయితీగా వృత్తి బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవరావు, వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ అంబేడ్కర్, బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు కొత్త కళ

- అమృత్ సరోవర్ కింద రూ.30 లక్షలతో మూడు చెరువులు అభివృద్ధి
- 80 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు


పొన్నాడలోని పగడబంద చెరువు

ఎచ్చెర్ల : అమృత్ సరోవర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంత చెరువులు, జలాశయాలు కొత్త కళను సంతరించుకుంటున్నాయి. పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన చెరువులు ఉపాధి పనులతో సరికొత్తగా రూపాంతరం చెందుతున్నాయి. ఎచ్చెర్ల మండలంలో ఇప్పటి వరకు మూడు చెరువుల్ని అమృత్ సరోవర్‌లో భాగంగా అభివృద్ధి చేయడంతో 80 ఎకరాల భూములకు పుష్కలంగా సాగునీటి సదుపాయం కలగనుంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పొన్నాడ గ్రామంలో పగడబంద చెరువును రూ.9.78 లక్షలతో అభివృద్ధి చేశారు. చెరువు సామర్థ్యం పెరిగేలా మరింత లోతు చేసి, పూడికలు తొలగించి గట్లు పటిష్టం చేశారు. గట్లపై కొబ్బరి మొక్కలను నాటారు. దీని పరిధిలో 35 ఎకరాల ఆయకట్టు ఉంది. ఫరీదుపేటలో పోలమ్మ చెరువును లోతు చేసి గట్లను పటిష్టం చేశారు. దీనికి రూ.9.98 లక్షలు ఖర్చు చేశారు. ఈ చెరువు కింద 24 ఎకరాల ఆయకట్టు ఉంది. అల్లినగరంలో పిచ్చమ్మ కోనేరులో రూ.9.97 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. దీని కింద 21 ఎకరాల ఆయకట్టు ఉంది.

రోజూ 300 మందికి ఉపాధి..

ఒక్కో చెరువులో రోజుకు 300 మంది వరకూ ఉపాధి వేతనదారులు పనిచేశారు. వ్యవసాయ పనుల్లేని సమయంలో వారికి ఉపాధి లభించడంతో పాటు చెరువులు కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకున్నాయి. రానున్న వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే చెరువులు నిండి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. దశాబ్దాల తర్వాత ఊరి చెరువుల రూపురేఖలు మారడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటికి ధీమా

అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో పొన్నాడ, ఫరీదుపేట, అల్లినగరం గ్రామాల్లో ఒక్కో చెరువు చొప్పున అభివృద్ధి చేశాం. ఈ చెరువుల కింద 80 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో చెరువులు నిండి ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందుతుంది. – శోభాదేవి, ఉపాధి ఏపీఓ


చెరువు గట్లుపై వేసిన కొబ్బరి చెట్లు


అల్లినగరంలోని పిచ్చమ్మ కోనేరు

గోపీనాథునికి ప్రత్యేక పూజలు

భామిని: లివిరిలో వెలసిన గోపీనాథ రాధాకృష్ణ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పాలు, పెరుగు, వెన్న, నెయ్యితో చేసిన పదార్థాలను నైవేద్యంగా పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సింగిడికి చెందిన వ్యాపారులు ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నసమారాధ చేశారు.

అత్తను హత్య చేసిన అల్లుడు

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. అడిగిన డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో అత్తను అల్లుడు హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతవాక దరి విజయదుర్గా కాలనీలో కొండపై బాణాల రాము అలియాస్ కరెంట్ రాము భార్య లక్ష్మి, ఆరేళ్ల కుమారుడితో నివాసముంటున్నాడు. అతని భార్యకు అనారోగ్యం కావడంతో ఇటీవల నగరంలో ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ జరిగింది. తన కూతురును చూసుకోవడానికి శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం ఎలమంచిలి గ్రామానికి చెందిన గుణ నారాయణమ్మ(60) నాలుగు రోజుల క్రితం హనుమంతువాక వచ్చింది. ఆస్పత్రిలో ఉన్న తన కుమార్తెకు భోజనం వండి క్యారేజీ పంపిస్తుండేది. రాము కొన్నాళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం తన అత్త నారాయణమ్మను రోజూ డబ్బులు అడుగుతుండేవాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో రెండు రోజులుగా అత్తతో గొడవపడుతున్నాడు. శనివారం ఉదయం కూడా అతడు నారాయణమ్మతో గొడవ పడి అడిగిన డబ్బులు ఇవ్వనందుకు ఇంట్లో ఉన్న ఇనుప రాడుతో తలపై బలంగా కొట్టాడు. అధిక రక్తస్రావమై ఆమె కుప్పకూలింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ద్వారకా ఏసీపీ మూర్తి, ఆరిలోవ సీఐ సోమశేఖర్‌రావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిందితుడు రామును అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా హత్యకు ఉపయోగించిన రాడ్డు మాత్రం పోలీసులకు లభించలేదు. పోలీసులు క్లూస్ టీమ్‌ను కూడా సంఘటన స్థలానికి రప్పించి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ సోమశేఖరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయ పంటలపై మంచుపగ

- ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసంతో దెబ్బతింటున్న పంటలు
- పెట్టుబడులు రాక నష్టపోతున్న రైతులు


పొగమంచు కారణంగా దిమ్మిడిజోల సమీపంలో దెబ్బతిన్న టమాటా పంట

భామిని: సాంప్రదాయ పంటలకు బదులుగా కూరగాయలు సాగు చేస్తూ రైతులు ఆదాయం పొందుతున్నారు. అయితే గత కొంతకాలంగా వాతావరణంలో వచ్చిన మార్పులతో కూరగాయ రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం దిగుబడిపై ప్రభావం చూపుతోంది. పగటి పూట అధిక ఎండలు, రాత్రిపూట పొగమంచుతో పంటలకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. పెట్టుబడికి తగిన దిగుబడి రాని పరిస్థితి నెలకొంది. మండలంలో రైతులు మునగ, బెండ, వంగ, మిరప, క్యాబేజీ, పొట్టి చిక్కుడు, బరబటీ, కాకర, చిక్కుడు, దొండ, బీర తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం కారణంగా తేనెమంచు పురుగు, కాయతొలుచు పురుగు, రసంపీల్చే పురుగు, బూడిద తెగులు, కాయకుళ్లు తెగులు వంటివి వ్యాప్తి చెందుతున్నాయి. ఒకవైపు దిగుబడి లేక రైతు లు నష్టపోతుంటే.. మారోవైపు మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరిగిపోయి వినియోగదారులపై ఆర్థిక భారం పడుతోంది.

మంచుతో తీవ్ర నష్టాలు

అకాలంగా కురుస్తున్న పొగమంచుతో పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విస్తరిస్తున్న తెగుళ్లతో సాగు పెట్టుబడులు పెరుగుతున్నాయి. దిగుబడి తగ్గిపోవడంతో సాగు ఖర్చులు కూడా రాక నష్టాలు మిగులుతున్నాయి.

– మునగవలస నూకయ్య, కూరగాయ రైతు, నేరడి–బి, భామిని

బడిలో ‘ఆర్‌ఆర్‌ఆర్’

ఇచ్ఛాపురం రూరల్: ఆస్కార్ అవార్డుల రేసులో తెలుగు చిత్రం ఆర్‌ఆర్‌ఆర్ ఉన్న సందర్భంగా చిత్ర బృందాన్ని అభినందిస్తూ ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆ చిత్రంలోని సన్నివేశాలను ప్రదర్శించారు.

శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి సుహాస్‌చంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక కాస్ట్యూమ్స్ ధరించి విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో అడవి సన్నివేశాలను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈఓ కురమాన అప్పారావు విద్యార్థులు, ఉపాధ్యాయులను ఎంతగానో మెచ్చుకున్నారు.


ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న ముచ్చింద్ర పాఠశాల విద్యార్థులు

విహారం.. విషాదం

- సముద్రంలో గల్లంతై బీ ఫార్మసీ విద్యార్థి మృతి
- రాళ్లపేట బీచ్‌లో ప్రమాదం


దుర్గాసతీష్ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల విహారం విషాదంగా మారింది. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ రెండో ఏడాది చదువుతున్న 12 మంది విద్యార్థు లు శనివారం మధ్యాహ్నం డి.మత్స్యలేశం పంచాయతీ రాళ్లపేట బీచ్‌కు సరదాగా వెళ్లారు. వీరిలో ఇద్దరు ఒడ్డున కూర్చోగా..పది మంది స్నానాల కోసం సముద్రంలోకి దిగారు. అంతలో వారిలో ఇద్దరు లోపలకు కొట్టుకుపోయారు. ఒడ్డున ఉన్న కొందరు మత్స్యకారులు దీన్ని గమనించి వెంటనే సముద్రంలోకి దిగి ఆకుల గణేష్ అనే విద్యార్థిని బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అతనిది విజయనగరం పట్టణం. అయితే గల్లంతైన మరో విద్యార్థి నిడదవోలు దుర్గాసతీష్ చౌదరి(21)ని రక్షించడం వారి వల్ల కాలేదు. ఎంత వెతికినా లా భం లేకపోవడంతో మోటారు బోట్లు, వలలు తీసుకువచ్చి గాలించారు. 30 నిమిషాల తర్వాత సతీష్ మృతదేహం వలకు చిక్కింది. ఒడ్డుకు తీసు కు వచ్చేసరికే ప్రాణాలు లేవని గుర్తించారు. అయి నా 108కు సమాచారం ఇచ్చారు. వాహన సిబ్బంది సైతం చూసి ప్రాణాలు లేవని చెప్పారు. మృతుడు పార్వతీపురానికి చెందిన వాడు. విద్యార్థులంతా కాలేజీ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. రెండో శనివారం సెలవు దినం కావడంతో సరదాగా గడుపుదామని వచ్చి ఇలా విషాదంలో చిక్కుకున్నారు. సతీష్ మృతి చెందిన విషయాన్ని స్నేహితులు అతని తల్లిదండ్రులకు చెప్పారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యనారాయణ మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.


స్థానికులు, విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు